క్లుప్తంగా

శరవేగంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



పనులను పరిశీలిస్తున్న నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి

కోట: స్థానిక బజారువీధిలో డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులను బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్ రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి కోట బజారువీధిలో డ్రైనేజీ కాలువలు శిథిలావస్థకు చేరుకుని ఉన్నాయన్నారు. రోడ్డు నిర్మాణంతో పాటు డ్రైనేజీ కాలువలను కూడా నేటి అవసరాలకు అనుగుణంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలని కోరారు.

బీమా నగదు అందజేత



నగదు అందజేస్తున్న ఉపసర్పంచ్ ప్రసాద్‌గౌడ్

కోట: కొత్తపట్నం పంచాయతీ పరిధిలోని గున్నంపడియ గ్రామంలో ఇటీవల మృతి చెందిన గిరిజన కూలీ రామలింగయ్య కుటుంబ సభ్యులకు బుధవారం వైఎస్సార్ బీమా నగదు అందజేశారు. కొత్తపట్నం ఉపసర్పంచ్ ఉప్పల ప్రసాద్‌గౌడ్ చేతుల మీదుగా మృతుని భార్య రమణమ్మకు రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అల్లాబక్ష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యకు చిరునామా జెడ్పీ హైస్కూల్



జెడ్పీ బాలికల హైస్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

గూడూరు: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తమ పాఠశాలలో అడ్మిషన్ల కోసం వినూత్నంగా ఆలోచించారు. 'మీ పిల్లలు క్రమశిక్షణతో మెలగాలన్నా.. నాణ్యమైన, అత్యుత్తమ విద్యను అభ్యసించాలన్నా మా పాఠశాలలో చేర్పించండి' అంటూ పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినుల ఫొటోలతో పాఠశాల ముఖద్వారం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఈ మార్గంలో వెళ్లే ప్రతి ఒక్కరూ అక్కడ ఆగి ఆ ఫ్లెక్సీలో ఉన్న విద్యార్థులు, వారు సాధించిన ఫలితాలను చూసి శెభాష్ అంటూ వెళుతున్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ



రవీంద్రబాబు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండల ఎంపీడీఓగా రవీంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ స్వరూపరాణి ఉద్యోగోన్నతిపై వెళ్లడంతో అప్పటి నుంచి ఇన్‌చార్జి ఎంపీడీఓగా వినీల్ వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారులు గూడూరు రూరల్ మండలం ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న రవీంద్రబాబును డిప్యూటేషన్‌పై బాలాయపల్లి ఎంపీడీఓగా నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు నడుమ వారధులు



పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో నాయకులు

పెళ్లకూరు: వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులుగా అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం చావలి సచివాలయంలో వలంటీర్లుకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ సురేష్ బాబు, కార్యదర్శి శ్రీహరి, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కోట: మండలంలోని ఊనుగుంటపాళెం సచివాలయ సర్వేయర్‌ను వేధింపులకు గురిచేస్తున్న రాజశేఖర్‌రెడ్డి అనే వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుల్లారావు బుధవారం తెలిపారు. విద్యానగర్ ఎన్టీఆర్ కాలనీకి చెందిన రాజశేఖర్‌రెడ్డి కొద్దిరోజులుగా ఫోన్‌లో వేధింపులకు గురిచేస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో విచారణ జరిపి కేసునమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

27న ఘంటసాల శత జయంతి వేడుకలు

కోట: మండల కేంద్రంలో ఈ నెల 27వ తేదీన ఘంటసాల కళాసమితి ఆధ్వర్యంలో ఘంటసాల శత జయంతి వేడుకలను కోటలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సమితి అధ్యక్షుడు ఉగ్రారపు నరసింహులు తెలిపారు. బుధవారం కోటలో ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటుడు సుమన్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఘంటసాల గాన కచ్చేరితో పాటు కళాకారులను సన్మానించనున్నట్లు తెలిపారు.

సర్వజన.. సంజీవని



పీహెచ్‌సీ చుట్టూ నిర్మించిన ప్రహరీ



ఆధునికీకరణ చేసిన తొగరాముడి పీహెచ్‌సీ

ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు పెద్దలు. రోగికి సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రసాదించే సర్వజన ఆస్పత్రులకు కాయకల్ప చికిత్స చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నాడు–నేడు పథకం అమలు చేసింది. ఈ పథకం దవాఖానాలకు సంజీవనిగా మారి, కొత్త ఊపిరిలూదుతోంది. ఫలితంగా సకల సౌకర్యాలు సమకూరుతున్నాయి.

- నాడు–నేడు ద్వారా పీహెచ్‌సీలో వసతుల కల్పన
- రోగులకు మెరుగైన వైద్యసేవలు

దొరవారిసత్రం: మండలంలోని తొగరాముడి గ్రామంలో ఉన్న పీహెచ్‌సీ ఆధునికీకరణతో దాని రూపురేఖలు మారిపోయాయి. సకల వసతులు సమకూరాయి. దొరవారిసత్రం–సూళ్లూరుపేట మండలాల సరిహద్దులోని తొగరాముడి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉంది. ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి నిత్యం సుమారు వంద మంది రోగులకు పైనే వైద్య సేవల కోసం వస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పీహెచ్‌సీ అభివృద్ధికి నోచుకోక రోగులు ఇక్కట్లు పడుతుండేవారు. టీడీపీ పాలనలో సుమారు రూ.40 లక్షలతో నిర్మించిన నూతన భవనం పదినెలలు కూడా గడవకముందే పనుల్లో నాణ్యతా లోపం కారణంగా గోడలు పగుళ్లు రావడంత, ఎక్కడ పడితే అక్కడ గదుల్లో ఫ్లోరింగ్ అంతా కుంగిపోవడంతో పాడుబడిన భవనంలా మారింది. దీంతో వైద్యాధికారులు, సిబ్బంది, రోగులు చేసేలేక ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పీహెచ్‌సీ సమస్యను స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత అధికారులతో మాట్లాడి 2020–21 ఏడాదిలో నాడు–నేడు కింద ఆస్పత్రి మరమ్మతులు, వసతుల కల్పనకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో పీహెచ్‌సీని ఆధునికీకరించారు.

నాడు–నేడుతో మారిన రూపురేఖలు

నాడు–నేడు పథకంతో తొగరాముడి పీహెచ్‌సీ రూపురేఖలు మారిపోయాయి. నాడు–నేడు నిధులతో ఆస్పత్రి భవనం మరమ్మతులు చేశారు. విద్యుత్ వసతి కల్పన, పడకల ఏర్పాటు, ఆపరేషన్ గదిలో ఏసీ తదితర వసతులు కల్పించారు. వైద్య సిబ్బంది, రోగుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. ఆస్పత్రికి ప్రహరీ నిర్మించి, చక్కటి వాతావరణం నెలకొనేలా అన్ని చర్యలు చేపట్టారు. పీహెచ్‌సీలో వైద్యులు నుంచి సిబ్బంది వరకు అన్ని పోస్టు భర్తీ చేశారు. ప్రస్తుతం ఇద్దరు వైద్యులతో పాటు, ముగ్గురు స్టాఫ్‌నర్స్‌లు, నలుగురు హెల్త్ సూపర్ వైజర్లు, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఎఫ్‌ఎన్‌ఓ, ఎల్‌డీ కంప్యూటర్, ఈడీసీ, ఆప్తామాలిక్ అసిస్టెంట్, స్వీపర్ ఉన్నారు. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి.

సంక్షేమ సైనికులు వలంటీర్లు



చిల్లకూరు: వలంటీర్ దివ్యకు సేవావజ్ర అవార్డు అందజేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

చిల్లకూరు: ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను అర్హులందరికీ నేరుగా చేరవేసే సైనికులు వలంటీర్లు అని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రతిభ కనపరిచిన వలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీ సభ్యులు సిఫార్సు చేసిన వారికి మాత్రమే పథకాలు దక్కేవని, కానే నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాటతో వలంటీర్లు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. అనంతరం ముత్యాలపాడు సచివాలయం పరిధిలో పనిచేస్తున్న మాచిరెడ్డి దివ్యకు సేవావజ్ర, తమ్మినపట్నం, వరగలి, తిక్కవరం, ఎన్ఆర్ పల్లి, ఉడతావారిపాళెం సచివాలయాల పరిధిలో పని చేసే కోడి కనుమూరయ్య, గున్నయ్య, వెంకటరమణయ్య, మనోహర్, దాసరయ్యకు సేవారత్న, మిగిలిన 254 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుపాకుల వెంకటరమణమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, సర్పంచ్‌లు గిద్దలూరు సుమలత, చిట్టేటి నారాయణ, నాయకులు మైలాం శ్రీనివాసులరెడ్డి, కనపర్తి దిలీప్ రెడ్డి, కట్టా రవీంద్రరెడ్డి, అన్నంరెడ్డి రమేష్‌రెడ్డి, ఉడతా శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవకు వందనం



గూడూరు రూరల్: వలంటీర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరురూరల్: ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు వందనమని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గూడూరు మండలంలోని వలంటీర్లను బుధవారం గూడూరులోని మండల సమాఖ్య కార్యాలయంలో సన్మానించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ అగ్రకులంలో పుట్టి పేద వారి అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న గొప్ప సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ వలంటీర్ల సేవలు ఎనలేనివని కొనియాడారు. అనంతరం సేవారత్న, సేవామిత్ర అవార్డులతో నగదు, మెడల్, ప్రశంసా పత్రాలను అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఊటుకూరు యామిని, డీఎల్‌డీఓ వాణి, తహసీల్దార్ లీలారాణి, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, రూరల్ సీఐ దశరథరామారావు, ఏపీఎం బుజ్జమ్మ, సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు చరిత్ర సృష్టించారు!



రాపూరు: వలంటీర్లను సన్మానిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

రాపూరు: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచిన వలంటీర్లు చరిత్ర సృష్టించారని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. ప్రభుత్వ పథకాలను పేదలకు చేరవేయడంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు దేశానికే ఆదర్శమన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ సొంత ఊరిలోని ప్రజలకు సేవలు అందించడం వలంటీర్లకు గొప్పవరమన్నారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రకు ఎంపికైన వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, నాయకులు పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, సర్పంచ్‌లు జయమ్మ, నారాయణమ్మ, ఏఎంసీ వైస్ చైర్మన్ గంగిశెట్టి వెంకటేశ్వర్లు, శశిరెడ్డి, కలపాటి మధుసూదన్‌రెడ్డి, పెంచలరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమం అమలుపై ప్రజల్లో సంతృప్తి



కలువాయి: దివ్యాంగుడితో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

కలువాయి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కలువాయి మండలం చింతలపాళెం, రామన్నగారిపల్లె గ్రామాల్లో బుధవారం గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు బి.అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు పంగా పెంచలనరసారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పామర్తి చెంచమ్మ, చింతలపాళెం సర్పంచ్ కండే వెంకటసుబ్బమ్మ, మాదన్నగారిపల్లి సర్పంచ్ దండు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గంధోత్సవం



ముస్తాబైన హాజరత్ ఖాదర్ షావలీ దర్గా

నాయుడుపేటటౌన్: పట్టణంలోని హాజరత్ ఖాదర్ షావలీ(చిన్నదర్గా) 39వ గంధోత్సవం (ఉరుసు) గురువారం నుంచి రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం జెండా, గంధం ఊరేగింపు, నగరోత్సవం జరుగుతుందన్నారు. శుక్రవారం తెల్లవారుజామున గంధోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం అన్నదానంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

గడపగడపకు మన ప్రభుత్వం రేపు

సైదాపురం: మండలంలోని వేములచేడు సచివాలయ పరిధిలో 26వ తేదీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జేఎస్‌సీ కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్, సర్పంచ్ చెమిర్తి జనార్దన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

పురస్కారాల ప్రదానం..

దక్కిలి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీన వలంటీర్లకు సేవారత్న, సేవామిత్ర పురస్కారాలను వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ అందజేయనున్నారని ఎంపీడీఓ కోటేశ్వరరావు తెలిపారు. వలంటీర్లు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

విద్యార్థినితో ఆటోడ్రైవర్ అసభ్యకర ప్రవర్తన

నాయుడుపేటటౌన్: ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలు రాసేందుకు ఆటోలో వెళుతున్న విద్యార్థినితో ఆటో డ్రైవర్ అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన నాయుడుపేటలో బుధవారం చోటు చేసకుంది. బాధితురాలు ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బుధవారం ఉదయం ఓ విద్యార్థిని నాయుడుపేట బస్టాండులో బస్సు దిగి, పెనల గుర్రప్పశెట్టి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఆటో ఎక్కింది. అయితే ఆటోలో విద్యార్థిని మాత్రమే ఉండడంతో ఆటో డ్రైవర్, ఆటోను పరీక్ష కేంద్రం వద్ద ఆపకుండా ఎవరూ లేని ప్రాంతంలో ఆపి విద్యార్థితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ విద్యార్థిని కేకలు వేసి భయాందోళనలతో పరుగు తీసింది. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నరసింహారావు ఆటోతోపాటు నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

అధికారులతో వాగ్వాదం

పెళ్లకూరు: జాతీయ రహదారి రోడ్డు విస్తరణలో భూమిని కోల్పోయిన నిర్వాసితులకు ఐదేళ్లుగా పరిహారం అందించడంలో సందిగ్ధత నెలకొనడంతో బుధవారం రెవెన్యూ అధికారులతో వారు వాగ్వాదానికి దిగారు. 2018లో పెన్నేపల్లెలోని సర్వే నంబర్ 10లో సుమారు పది మందికి సంబంధించిన ఇళ్ల స్థలాలను రోడ్డుకు తీసుకున్నారు. గతంలో ఇక్కడి వ్యవసాయ భూమిని ల్యాండ్ కన్వర్షన్‌తో ఇళ్ల స్థలాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా రోడ్డుకు కేటాయించిన భూమిని వ్యవసాయ భూమిగా నమోదు చేయడంపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన అధికారులు మాట్లాడుతూ త్వరలో పూర్తి స్థాయి సర్వే చేసి, నిర్వాసితులందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడుతామని చెప్పారు.

చిన్నారులతో పని చేయిస్తే చర్యలు

గూడూరు: బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై చర్యలు తప్పవని గూడూరు కార్మిక శాఖ సహాయ కమిషనర్ సురేష్‌కుమార్ హెచ్చరించారు. దుకాణాలు, సంస్థల్లో 14 ఏళ్లలోపు, ప్రమాదకర సంస్థల్లో 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో నియమించుకుంటే కార్మిక చట్టం ప్రకారం తీవ్ర నేరంగా పరిగణిస్తామని చెప్పారు.

కోట వాసుల నిరసన



రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలుపుతున్న స్థానికులు

కోట: ఆక్రమణల తొలగింపు పేరుతో ఇళ్లు కూల్చేస్తున్నారని కోటలోని ఆకుతోట వీధివాసులు బుధవారం నిరసన తెలిపారు. పల్లమాల–తూపిలిపాళెం రోడ్డు నిర్మాణంలో భాగంగా కోట బజారువీధిలో కొన్ని రోజులుగా అధికారులు ఆక్రమణలు తొలగింపు చేపడుతున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే బుధవారం ఆకుతోట దిబ్బవీధిలో రోడ్డు పక్కన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు సిద్ధం కాగా స్థానికులు అడ్డుకున్నారు. ఏళ్ల తరబడి ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నామన్నారు. అందరూ కూలీ పనులు చేసుకుని జీవించే పేదవారమన్నారు. ఉన్నపళంగా తమ ఇళ్లు కూల్చేస్తే ఎలా బతకాలంటూ తహసీల్దార్ పద్మావతిని ప్రశ్నించారు. రోడ్డు నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని తాము వదులుకున్నామని, కొందరు ఉద్దేశపూర్వకంగానే తమ నివాసాలు ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బయటి వ్యక్తులు ఇక్కడ నుంచి వెళ్లి పోవాలని తమని కొందరు బెదిరిస్తున్నారని మహిళలు వాపోయారు. ఎమ్మెల్యే తమకు న్యాయం చేస్తారని, ఎమ్మెల్యే వచ్చే వరకు ఆగాలని స్థానికులు డిమాండ్ చేయడంతో అధికారులు వెనుదిరిగారు.

తపాలా జీవిత బీమాను సద్వినియోగం చేసుకోండి



బీమా చెక్కు అందజేస్తున్న కుమార్

దక్కిలి: తపాలా జీవిత బీమాను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గూడూరు తపాలా పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీఏకే కుమార్ తెలిపారు. మండలంలోని మిట్టవడ్డిపల్లె గ్రామానికి చెందిన కే నాగేశ్వరరావు అనే వ్యక్తి తపాలా జీవిత బీమా చేసి, ప్రమాదవశాత్తు మరణించడంతో ఆయన భార్య జయమ్మకు దక్కిలి పోస్టాఫీసులో రూ.2.28 లక్షల చెక్కును బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపాలా బీమా తీసుకోవడంతో అనుకోకుండా ప్రమాదవశాత్తుతో మరణిస్తే ఆ కుటుంబానికి బీమా భరోసాగా నిలుస్తోందన్నారు. తపాలా శాఖ ద్వారా వివిధ రకాల చిన్నమొత్తాల పొదుపు పథకాలు, డిపాజిట్, నెలసరి ఆదాయ పథకం, పదేళ్లలోపు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి పథకాలు ఎక్కువ వడ్డీ రేట్లతో అందుబాటులో ఉన్నాయన్నారు.

సూళ్లూరుపేటలో మానవ హారం



ఆందోళన చేస్తున్న జేవీవీ, సీఐటీయూ, యూటీఎఫ్ ప్రతినిధులు

సూళ్లూరుపేట: న్యూఢిల్లీలో ఆందోళనలకు సంఘీభావంగా జనవిజ్ఞానవేదిక, సీఐటీయూ, యూటీఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద మానవహారం ఏర్పాటు చేసి, నిరసన తెలిపారు. భారత రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు నినదించారు. యూటీఎఫ్ ప్రతినిధి సీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీఆర్‌కు ఎంపీ గురుమూర్తి పరామర్శ



బుజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గురుమూర్తి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు బైనా చంద్రశేఖర్‌రెడ్డిని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి పరామర్శించారు. చంద్రశేఖర్ రెడ్డి తల్లి బుజ్జమ్మ మృతి చెందడంతో బుధవారం పట్టణంలో జరిగిన ఆమె ఉత్తర క్రియల్లో ఎంపీ నాయకులతో కలసి పాల్గొన్నారు. ఎంపీ గురుమూర్తి ఈ సందర్భంగా బుజ్జమ్మకు నివాళులర్పించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్ రెడ్డి, మురళీరెడ్డి, ఎన్‌డీసీసీబీ నెల్లూరు చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నాయకులు కటకం జయరామయ్య, బైనా మల్లికార్జునరెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి ఉన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు



మాట్లాడుతున్న ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): మండలంలోని అన్నీ గ్రామాల్లో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంఘమిత్ర కార్యాలయంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్యమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి అవసరమైన మట్టి తరలింపునకు అడ్డంకులు లేకుండా పూర్తి స్థాయిలో అనుమతులు ఇవ్వాలన్నారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ విషయం తీసుకెళతామన్నారు. పిగిలాం– జార్లపాడు గ్రామాల రోడ్డు అధ్వానంగా ఉండడంతో బస్సు సర్వీసు నిలిపివేసే పరిస్థితి ఉందని, ఆ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. యాచవరం పీఏసీఎస్ అధ్యక్షుడు రావెళ్ల వెంకటకృష్ణమనాయుడు, పాకపూడి, వెంగమాంబపురం సర్పంచ్‌లు మల్లెమాల గోపీకృష్ణారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరుల ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బట్టేపాటి మురళీమోహన్‌రెడ్డి, వాన పార్వతి, ఎంపీడీఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వివిధ పనులకు రూ.53 లక్షలు కేటాయింపు



మాట్లాడుతున్న చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి

సూళ్లూరుపేట: చెంగాళమ్మ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పట్టణంలో వివిధ పనులకు రూ. 53 లక్షలు కేటాయించామని మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవన్‌లో బుధవారం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరునాళ్లు జరిగే రోజుల్లో పారిశుద్ధ్యం, తాగునీరు తదితర వసతుల కల్పనకు ఈ నిధులను వినియోగిస్తామని చెప్పారు. నిధుల కేటాయింపునకు కౌన్సిలర్లు అందరూ ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. అనంతరం వైస్‌చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్లు మీజూరు రామకృష్ణారెడ్డి, సన్నారెడ్డి సౌజన్య, కొండూరు జనార్దన్ తదితరులు పట్టణంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ మాట్లాడుతూ సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని చెప్పారు. సమావేశంలో కమిషనర్ నరేంద్రకుమార్, వైస్ చైర్మన్ పోలూరు పద్మా మిల్టన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కూలీలకు ఎండ తీవ్ర లేకుండా పని చేసే చోట మౌలిక వసతులు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ గోపీనాథ్‌కు ఆర్డీఓ కిరణ్‌కుమార్ సూచించారు. మండలంలోని రామారెడ్డిపాళెంలో జరుగుతున్న ఉపాధి పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కమ్యూనిటీ ఫాండ్ పనులను కోనేరు ఆకారంలో వినూత్నంగా చేపట్టిన ఫీల్డ్ అసిస్టెంట్ సుమతిని అభినందించి, పనులు బాగా చేయిస్తున్నారని కితాబు ఇచ్చారు. ఎంత మంది కూలీలు పనికి వస్తున్నారు, ఎన్ని గ్రూపులు పని చేస్తున్నాయన్న విషయాలను నమోదు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల జరిగే చోట నీడ, తాగునీటి వసతి కల్పించడంతో పాటుగా దాతల సహకారం తీసుకుని కూలీలకు మజ్జిగ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సచివాలయ వైద్య సిబ్బంది ఉపాధి పనులు చేసే చోట కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లును పంపిణీ చేయాలన్నారు. అనంతరం ఏఎంసీ మాజీ చైర్మన్ నల్లారెడ్డి రమేష్‌బాబురెడ్డి దాతృత్వంతో పనికి హాజరైన సుమారు 150 మంది కూలీలకు మజ్జిగను పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది ద్వారా ఓఆర్ఎస్ ప్యాకెట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ గిరి, ఏఎస్ఎం వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులకు శిక్షణ

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో జేఎన్‌టీయూఏ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అధ్యాపకుల శిక్షణ తరగతులు మూడో రోజైన బుధవారం కూడా కొనసాగాయి. తాడేపల్లిగూడెం నిట్–ఏపీ క్యాంపస్ నుంచి ఈసీఈ విభాగం ప్రొఫెసర్ కిరణ్‌కుమార్ హాజరై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.